క్లుప్తంగా

తహసీల్దార్‌గా దయాకర్‌రెడ్డి



దామరగిద్ద: మండల తహసీల్దార్‌గా అనుముల దయాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జయరాములు కొత్తపల్లి తహసీల్దార్‌గా బదిలీ కాగా ఆయన స్థానంలో కృష్ణా మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న దయాకర్‌రెడ్డి దామరగిద్దకు బదిలీ కాగా బాధ్యతలు చేపట్టారు. ఆర్‌ఐ, సీనియర్ అసిస్టెంట్ కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండల ప్రజలకు తహసీల్దార్‌గా తనవంతు సేవలను అందిస్తానని ఆయన తెలిపారు.

మండల తహసీల్దార్‌గా జయరాములు

కొత్తపల్లి: కొత్తపల్లి మండల నూతన తహసీల్దార్‌గా జయరాములు బాధ్యతలు తీసుకున్నారు. ఈయన దామరగిద్ద మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బాధ్యతలు తీసుకున్నారు. కొత్తపల్లిలో పనిచేస్తున్న అనిల్‌కుమార్ మరికల్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పరిష్కారం కాని భూ సమస్యలపై దృష్టిసారించి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని అన్నారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

నారాయణపేట టౌన్: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహన డ్రైవర్లకు శుక్రవారం మక్తల్ పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్లో ఉచిత వైద్యపరీక్షలు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ వాహనాల టాక్సీ, ఆటో స్టాండ్ల వద్ద డ్రైవర్లకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ డ్రైవర్లకు వైద్యపరీక్షలు చేయడం ద్వారా వారి ఆరోగ్యాన్ని నిర్ధారించి రోడ్డు భద్రతను పెంచవచ్చన్నారు.

రైతు దీక్షకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు



కొత్తపల్లి: రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో శుక్రవారం నిర్వహిస్తున్న రైతు దీక్షకోసం మండలం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహిస్తున్న రైతు దీక్షకు కోడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తున్న మోసపూరిత హామీలను ఎండగట్టేందుకు చేస్తున్న బహిరంగ సభకు తరలిళ్లారు.

కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలిగా ప్రసన్నరెడ్డి



కోస్గి రూరల్: జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలిగా మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లికి చెందిన ప్రసన్నరెడ్డి ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సునితరావు చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. మహిళ సభ్యత్వ నమోదులో ఉమ్మడి మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో మొదటిస్థానంలో నిలిచారు. రెండవసారి ఎన్నికై నందున నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరికి ధన్యవాదాలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మద్దూరు: మద్దూరుకు చెందిన ఖర్షీద్ బేగంకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శుక్రవారం కాంగ్రెస్ మైనార్టీ నాయకులు రహీం, హుసేన్, సద్దాం తదితరులు అందజేశారు. ఈమె భర్త మహమ్మద్ గౌస్‌కు ఆరోగ్యం బాగలేక ఆస్పత్రిలో చేరండంతో ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ నిధుల నుంచి రూ. 85వేల చెక్కు మంజూరైయిందని వారు పేర్కొన్నారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

ధన్వాడ: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో శుక్రవారం సాయంత్రం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైనా సంఘటన చోటుచేసుకుంది. వివరాలిలా.. మండల కేంద్రానికి చెందిన పెదుముతి శ్రీనివాసులు బీసీ కాలనీలోని బురుజుగడ్డ ఆంజనేయస్వామి ఆలయం నుంచి వస్తుండగా తహసీల్దార్ కార్యాలయం నుంచి రామకిష్టాయిపల్లికి వెళ్తున్న బైకు వేగంగా ఢీకొట్టడంతో శ్రీనివాస్ కాలికి తీవ్ర గాయాలైయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

సంత.. తీరని చింత



కనీస వసతులు లేని మరికల్ సంత

- సంత లేక ప్రజల ఇక్కట్లు
- ఏళ్లు గడుస్తున్నా తీరని అంగడి తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారస్తులు, ప్రజలు



రోడ్డుపైనే విక్రయిస్తున్న వ్యాపారులు

మరికల్: సాధారణంగా వారాంతపు సంతలు ప్రతి మండల కేంద్రంలోనూ, పెద్ద గ్రామాలు, మారుమూల ప్రాంతాల్లో నిర్వహిస్తుంటారు. దీనికోసం ఆయా గ్రామాల పంచాయతీలు, ఆయా మున్సిపాలిటీల్లో వివిధ ప్రాంతాల్లో నుంచి వచ్చే వ్యాపారులకు అనువుగా ఉండేందుకు ఓ విశాలమైన స్థలం కేటాయిస్తారు. తద్వారా ఆయా శాఖలకు ఆర్థికంగా కొద్ది మొత్తంలో సమకురుతుంది. అదేవిధంగా ఆయా ప్రాంతాల ప్రజలకు అనువైన ధరల్లో కూరగాయాలు, ఇంట్లో కావల్సిన వస్తు సామగ్రి అతి తక్కువ ధరలకు అందుబాటులో ఉంటాయి. ఇది ప్రాచీన కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న తీరు. జిల్లాకు ముఖ్య పట్టణంగా ఉన్న మరికల్‌ల్లో మాత్రం అభివృద్ధి ఒక అడుగు ముందుకెస్తే మూడు అడుగులు వెనకడుగు పడుతోంది. నాలుగు మండలాలకు ప్రధాన కేంద్ర బిందువుగా ఉన్న మరికల్‌లో కనీసం సంతకు ప్రత్యేక మార్కెట్ లేకపోవడంతో రోడ్లపై చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా...

నియోజకవర్గంలో నారాయణపేట మినహా మరికల్, ధన్వాడ, దామరగిద్ద, కోల్‌యికొండ మండలాల్లో సంతలకు ప్రత్యేక స్థలం లేక రోడ్లపైనే వ్యాపారాలను వారంతపు సంతలను నిర్వహిస్తున్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వీరి సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. సంతలో వ్యాపారం చేసేవారికి మరుగుదొడ్లు, టెంట్లు, నీటివసతి కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. సంతలకు ప్రత్యేక స్థలం కేటాయించేందుకు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటే బాగుంటుందని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



సంతలో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇతర గ్రామాల నుంచి వచ్చిన వ్యాపారులకు కనీసం మరుగుదొడ్లు, నీటి వసతి కల్పించకపోవడంతో రోడ్లపైనే భోజనాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తైబజార్ తీసుకుంటున్న వసతులు మాత్రం కల్పించడం లేదు. నూతనంగా మార్కెట్ నిర్మాణం చేపడితే బాగుంటుంది.

అనంతిరెడ్డి, కూరగాయాల, వ్యాపారి

వర్షాకాలం వస్తే చాలు కష్టమే..



వర్షకాలం వస్తే చాలు వర్షాలకు తడుస్తు, వేసవిలో ఎండలను భరీస్తు కూరగాయలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఎమ్మెల్యే స్పందించి కూరగాయల మార్కెట్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎల్లప్ప, మరికల్

నిధులు మంజూరు కావాలి

మండల కేంద్రంలో నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు విషయం ప్రభుత్వం చేతిలో ఉంది. నిధులు మంజూరైతే, గ్రామస్తులు సహకారిస్తే అన్ని వసతులతో వారంతపు సంతను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

కొండన్న, ఎంపీడీఓ

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

మాగనూర్: వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం అందరూ డ్రై డే పాటించాలని ఏఎన్‌ఎం సుధా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు వార్డులో సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఆమె మాట్లాడుతూ.. ఇళ్లలో వాడే నీటిని నిల్వ ఉంచొద్దని, కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో ఉంచకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు రేణుక, సరిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

కాంగ్రెస్ హామీ నిలబెట్టుకోవాలి



ధర్నాలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

నారాయణపేట రూరల్: అన్ని అర్హతలు ఉన్న కోటకొండ గ్రామాన్ని మండలంగా ఏర్పాటుచేసి కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.కృష్ణారెడ్డి అన్నారు. కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం రెండవరోజు ధర్నా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలతోపాటు ఎంతో చైతన్యవంతమైన గ్రామమని, వివిధ రంగాలకు చెందిన ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని గుర్తుచేశారు. మండలంగా ఏర్పాటు చేసేందుకు అన్ని అర్హతలు కలిగిన గ్రామమని అన్నారు. కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాము, కాశీనాథ్, సలీం, యాదగిరి, రాము, విజయలక్ష్మి, కాలేశ్వర్, రామకృష్ణ, ప్రశాంత్, వెంకటరాములు, నర్సింహ, నారాయణ, సాయికుమార్ పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు పకడ్బందీగా సేకరించాలి



మద్దూరు పట్టణ శివారులో భూములను పరిశీలిస్తున్న అధికారులు

మద్దూరు: రైతు భరోసా పథకం అమలుకోసం మండలాధికారులు శుక్రవారం మద్దూరు, పెదిరిపాడ్, చింతల్‌దిన్నే గ్రామాల్లో భూములను పరిశీలించారు. రెవెన్యూ విలేజ్ ఆధారంగా సర్వే నెంబర్లవారికి భూములను పరిశీలించారు. గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ భూముల్లో కట్టడాలను, ఇటుక బట్టీలను, పౌల్ట్రీ ఫాంను పరిశీలించి రికార్డుల్లో నమోదు చేస్తున్నట్లు తహసీల్దార్ మహేష్‌గౌడ్ తెలిపారు. ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎంపీఓ రామన్న పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల కోసం..

నూతనంగా రేషన్‌కార్డుల జారీకోసం మండలానికి ప్రభుత్వం నుంచి 844మంది వివరాలు వచ్చాయని వారినే నిబంధల మేరకు సర్వే చేస్తున్నామని ఎంపీడీఓ నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సర్వేలో తహసీల్దార్ మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు విధిగా నమోదు చేయాలి..

దామరగిద్ద: రైతు భరోసా పథకంలో భాగంగా సాగు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు ప్రభుత్వం అందించిన మార్గదర్శకాలను పాటిస్తు సర్వే చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మణిచందర్ అన్నారు. మండలంలోని లోకూర్తిలో పర్యటించి సర్వే బృందంతో మాట్లాడారు.. ప్రభుత్వ ఆదేశాల ఆధారంగా సర్వే నిర్వహించాలన్నారు. గ్రామ కంఠంలో ఉన్న నాల కన్వర్షన్, లేదా ఇళ్ల నిర్మించిన భూములు, రియల్‌ఎస్టేట్, రోడ్లు పరిశ్రమలుగా మారిన ఇతర భూముల వివరాలు విధిగా నమోదు చేయాలని సూచించారు. ఆర్‌ఐ బాల్‌రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలో వివరాల సేకరణ..

మాగనూర్: రైతు భరోసాకోసం చేస్తున్న సర్వే వివరాలను సక్రమంగా నమోదు చేయాలని మండల ప్రత్యేకాధికారి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గ్రామాల్లో రెండవరోజు నిర్వహించిన సర్వేను పరిశీలించారు. ఏన్నో సంవత్సరాలుగా సాగు చేయని భూములను గుర్తించడంతో పాటు క్రసర్‌లను, ఇటుక బట్టీలను, ప్లాట్లను పరిశీలించి వివరాలు సేకరించారు. పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, ఏఈఓ పవన్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ ఆరవింద్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాగనూర్‌లో ..



లోకూర్తిలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

ఇండియన్ గ్యాస్ ఎక్స్‌చేంజ్ మేళా విజేత



నర్వ: ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజ్ మేళాలో చంద్రఘడ్ గ్రామానికి చెందిన మహిళ విజేతగా నిలిచిందని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చంద్రఘడ్ గ్రామానికి చెందిన గవినోళ్ల జ్యోతికి 30గ్రాముల వెండి పతకాన్ని ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సికింద్రాబాద్ వారు నవంబర్ 1నుంచి జనవరి 13వరకు సాయి భగవంత్ ఏజెన్సీ ద్వారా ఎక్స్ఛేంజ్ మేళా నిర్వహించిన లక్కీ డ్రాలో గెలుపొందిన విజేతకు ఈ బహుమానం అందించామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయరెడ్డి, నర్సింహారెడ్డి, గ్యాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా కాంగ్రెస్



నర్వ: అనారోగ్య బాధితులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ అన్నారు. శుక్రవారం లంకాల్ గ్రామానికి చెందిన వెంకటేష్‌కు రూ.1.50లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితుడు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సహకారంతో మెరుగైన చికిత్సకోసం ఎల్‌ఓసీని అందించామన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు కోట్ల శ్రీనివాసులు, రవి, పాండు, జీకే మూర్తి, కృష్ణయ్య, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, బాలు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతిపత్రం



ఊట్కూరు: సమగ్ర ఇంటింటి సర్వేలో పనిచేసిన ఎన్యూమరేటర్‌లకు పారితోషికం విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ ధనుంజయ్యాగౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ.. కుటుంబ సర్వేలో ఉపాధ్యాయులు, అధికారులు ఎంతో కష్టపడి పనిచేసిన ఇప్పటి వరకు పారితోషికం అందలేదని ఆవేదన తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి పారితోషికం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగప్ప, బన్నేష్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా భావించాలి



దామరగిద్దలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న బాల్‌చందర్‌రెడ్డి

దామరగిద్ద: క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా భావించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నాయకులు బాల్‌చందర్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి క్రీడల్లో భాగంగా స్థానిక యువకులు అశోక్ యాదవ్, రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానం చేశారు. మొదటి బహుమతిగా రూ. 5వేల నగదును దాత పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో మల్కప్ప, అంజి, వెంకటేష్, నర్సింహులు, మొగులప్ప పాల్గొన్నారు.

హోరహోరీగా..



మరికల్ కబడ్డీలో మొదటి బహుమతి గెలుచుకున్న మల్లికార్జున్ జట్టు

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో యువక మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన కబడ్డీ పోటీలు హోరహోరిగా సాగిన పోటీల్లో మల్లికార్జున జట్టు విజేతగా నిలిచింది. అలాగే క్రికెట్ టోర్నమెంట్ పోటీలు కూడా హోరహోరిగా కొనసాగుతున్నాయి. గెలుపొందిన వారికి రెండురోజుల తర్వాత బహుమతులు అందజేస్తామని యువక మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. హరీష్, ఆంజనేయులు, నాగరాజు, ప్రకాష్, ఎల్లప్ప, బీరప్ప పాల్గొన్నారు.

దేవాలయ భూములను పరిరక్షించాలి

ఊట్కూరు: మండలంలోని పల్లెకుంట శివారులోని ఆలయ భూములను పరిరక్షించాలని కోరుతూ.. తహసీల్దార్ రవికి శుక్రవారం ఓబులాపూర్ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఓబులాపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన సర్వే 20లో 5ఎకరాల 23గుంటల భూమి పల్లెకుంట శివారులో ఉందని తెలిపారు. కొంతమంది దళారులు ఇట్టి భూమిని బినామీల పేర్లపై సృష్టించి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని అధికారులు స్పందించి ఆలయ భూములను పరిరక్షించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు భీంరెడ్డి, లక్ష్మారెడ్డి, రాఘవేంద్రాచారి, అంజప్ప, బాలప్ప, రామాంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.



ఊట్కూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఓబులాపూర్ గ్రామస్తులు

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు పరిశీలన

ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. అలాగే తాగునీరు, విద్యుత్, ఇతర సదుపాయాల గురించి ఆరా తీశారు. డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు అనువైన సౌకర్యాలు ఆస్పత్రిలో ఉన్నాయని పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వారు తెలిపారు. మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి స్థానిక కిడ్నీ సంబంధిత రోగులు డయాలసిస్ కోసం పడుతున్న ఇబ్బందులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు విన్నవించడంతో.. స్పందించిన ఆయన డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు సానుకూలంగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరినారాయణ, డాక్టర్ నిస్సార్‌అహ్మద్, డయాలసిస్ టెక్నీషియన్లు అజ్మతుల్లా, సుధీర్, కాంగ్రెస్ నాయకులు కుర్నీ రవికాంత్, రహ్మతుల్లా, తులసీరాజ్, అనీస్, నాగాంజనేయులు, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.



ప్రభుత్వాస్పత్రిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



సోళీపురంలో బడికి రాని విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ జయశంకర్

ఆత్మకూర్: రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ నిర్వహిస్తున్న బడి బయట పిల్లల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా మండలంలో సర్వే వేగవంతంగా కొనసాగుతుంది. సీఆర్పీ సౌమ్యరాణి, ఈఆర్టీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గ్రామాల్లో బడి బయటి పిల్లల వివరాలను నమోదు చేశారు. పాఠశాల్లో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఖిల్లాఘనపురం: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం 'పిల్లలు బడిలో–పెద్దలు పనిలో' కార్యక్రమాన్ని చేపట్టిందని మండల విద్యాధికారి జయశంకర్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా మండలంలో శుక్రవారం నుంచి ఇంటింటి సర్వే చేపట్టారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలందరిని బడిలోనే చేర్పించాలని కోరారు. సోళీపురం గ్రామంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.నందిని చాలా కాలంగా పాఠశాలకు రాకపోవడంతో తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపిచేలా ఒప్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ సీఆర్పీ రాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు తొలగించండి

అమరచింత: మస్తీపురంలో వెలసిన శ్రీహజరత్ హజిమలాంగ్ బాబా దర్గా ఉర్సోత్సవాలు ఈనెల 21న నుంచి ప్రారంభం అవుతున్నాయని, రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం జామీయా మసీదు కమిటీ సభ్యులు వినతిపత్రం అందించారు. ఈమేరకు మసీదు కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమరచింత పట్టణం నుంచి మస్తీపురం దర్గాకు కచ్చ రహదారి ఉందన్నారు. రహదారికి ఇరువైపులా ముళ్ల చెట్లు పెరగటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోయారు. మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ ముళ్లపొదల తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ముర్షద్ మైనోద్దీన్, ఖాసీం, తౌఫిక్, పాషా తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న మసీదు కమిటీ సభ్యులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడు ప్రాథమికోన్నత పాఠశాలలో 1994–95 బ్యాచ్ ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిరపడి నేడు కలుసుకోవడంతో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరికొకరు పంచుకున్నారు. అనంతరం పాఠశాలకు వాటర్‌ఫిల్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజు, రాఘవేందర్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా వెంకటేష్

కృష్ణా: మండల నూతన తహసీల్దార్‌గా వెంకటేష్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ వెంకటేష్‌ను బీజేపీ నాయకులు సోంశేఖర్‌గౌడ్, నల్లె నర్సప్ప, బీజేవైఎం నాయకులు సచిన్‌భట్, జనార్దన్‌గౌడ్ సన్మానించారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..



మక్తల్: పట్టణంలోని మార్కెట్ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూస్తానని మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ గవినోళ్ల రాధమ్మ అన్నారు. శుక్రవారం మార్కెట్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌కు వచ్చేరైతులకు ధాన్యం అమ్మేందుకు అన్నివిధాలుగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తానని అన్నారు. అనంతరం చైర్‌పర్సన్‌ను రంజిత్‌రెడ్డి, ఫయాజ్, జనార్దన్, నాగరాజు, బాలప్ప తదితరులు సన్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిరక్షరాస్యతతోనే వెనుకబాటు

కోయిల్‌కొండ: మహిళలు నిరక్షరాస్యతతోనే వెనకబడిపోతున్నారని సీడీపీఓ శైలజ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఓఎంఐఎఫ్ ఆధ్వర్యంలో ఒంటరి మహిళలకు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో పెరిగిపోతున్న లింగవివక్షకు, మహిళల పట్ల జరుగుతున్న అఘాత్యాలకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
నారాయణపేట జి. వెంకటేష్ గౌడ్ - 96666 52077
మక్తల్ మహేష్ - 83099 46853
కోస్గి కె. రమేష్ - 99486 98552

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:

యాడ్స్ మేనేజర్
9951602829
జావిద్: 90109 62007